క్లుప్తంగా

ఆలయాలను సందర్శించిన సబ్‌జడ్జి



కరియమాణిక్యస్వామి ఆలయంలో జడ్జి సాయిసుధ

నగరి : తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ నాంపల్లి కోర్టులో సబ్ జడ్జిగా ఉన్న సి.సాయిసుధ ఆదివారం నగరి పట్టణంలోని కరియమాణిక్య స్వామి ఆలయాన్ని, దేశమ్మ ఆలయాన్ని సందర్శించారు. దేశమ్మ దేవతకు చీర, రవిక, గాజులు, పసుపు, కుంకుమ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన తండ్రి కాశీ విశ్వేశ్వర రావు 1998–99 సంవత్సరంలో నగరి కోర్టులో జడ్జిగా ఉండేవారన్నారు. అప్పుడు నగరిలోని ప్రైవేటు పాఠశాలలోనే తాను చదువుకున్నానని తెలిపారు. అప్పట్లో తాను ఈ ఆలయాలకు వెళ్లానని, మళ్లీ ఇప్పుడు ఆ ఆలయాలను చూడాలని నగరికి విచ్చేసినట్టు చెప్పారు.

జోరుగా డ్రైనేజీ నిర్మాణ పనులు



ముత్తరాశికండ్రిగ గ్రామంలో డ్రైనేజీ నిర్మాణ పనులు జరుగుతున్న దృశ్యం

పుత్తూరు రూరల్: పుత్తూరు మున్సిపాలిటీలోని 12 వార్డులో డ్రైనేజీ నిర్మాణాలు జోరుగా జరుగుతున్నాయి. గ్రామాల్లో డ్రైనేజీలు లేక ప్రజలు పడుతున్న ఇబ్బందులను వార్డు కౌన్సిలర్ బాలాజీ ఇటీవల మంత్రి ఆర్కే రోజా దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై వెంటనే స్పందించిన మంత్రి 15వ ఆర్థిక సంఘం నిధులతో రెండు గ్రామాల్లో డ్రైనేజీలు నిర్మించాలని మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎన్ రెడ్డిని ఆదేశించారు. ముత్తరాశికండ్రిగ గ్రామంలో రూ.5 లక్షల అంచనా వ్యయంతో 156 మీటర్ల మేర ఒకటి, చిన్నబ్బనాయుడు కండ్రిగలో రూ.3 లక్షలతో 97 మీటర్ల మేర మరో డ్రైనేజీ పనులను ప్రారంభించారు. గ్రామాల్లో డ్రైనేజీల నిర్మాణాలు జరుగుతుండడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


రచయిత్రి ధనాశి ఉషారాణికి వరల్డ్ బుక్ అవార్డు



అవార్డు అందుకుంటున్న ధనాశి ఉషారాణి

భాకరాపేట : భాకరాపేట కు చెందిన భౌతిక శాస్త్ర ఉపాధ్యాయురాలు, రచయిత్రి ధనాశి ఉషారాణి శ్రీశ్రీ వేదిక జాతీయ అధ్యక్షుడు కత్తి మండ ప్రతాప్ నుంచి వరల్డ్ బుక్ అవార్డు అందుకున్నారు. ఆదివారం మహతి ఆడిటోరియంలో జరిగిన ప్రపంచ తెలుగు బ్రహ్మోత్సవాల్లో ఈ అవార్డు ప్రదానం చేశారు.

సిపాయి స్త్రీ స్వేచ్ఛకు శ్రీకారం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం

రేణిగుంట: సిపాయి స్త్రీ స్వేచ్ఛ కార్యక్రమం ద్వారా గ్రామీణ మహిళల సంపూర్ణ ఆరోగ్యం సాధ్యం అవుతుందని నెల్లూరు జిల్లా న్యాయమూర్తి సి.సత్యవాణి అన్నారు. రేణిగుంట మండలం సూరప్పకశం గ్రామంలో ఆదివారం సిపాయి స్త్రీ స్వేచ్ఛ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఎమ్మెల్సీ సభ్యులు డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం పాల్గొన్న ఈ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మహిళల ఆరోగ్యం కోసం వినూత్నమైన పథకాన్ని ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం చేపట్టడం సంతోషకరమన్నారు. మహిళల రక్షణ కోసం ఉన్న చట్టాల గురించి అవగాహన కల్పించారు. ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం మాట్లాడుతూ మహిళలలో శుభ్రతపై అవగాహన పెరగాలన్నారు. నెలసరి సమయంలో శుభ్రత నియమాలను పాటించకపోవడం వల్ల ఏటా లక్షలాది మంది మహిళలు గర్భాశయ క్యాన్సర్‌కు గురవతున్నారని తెలిపారు. దీంతో తాను నియోజకవర్గంలో ఏడాదికి సరిపడా మహిళలకు 30లక్షల శానిటరీ ప్యాడ్లను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అలాగే బాలింతలు, గర్భిణులకు ఎండు ద్రాక్ష, ఆరు కిలోల ఖర్జూరం, ఉసిరి, హార్లిక్స్ కిట్లను పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. ఈ వినూత్న కార్యక్రమం ద్వారా పేద గ్రామీణ మహిళల ఆరోగ్య సంరక్షణ సాధ్యం అవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం మహిళలకు కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు సుధ, లక్ష్మీపతిరెడ్డి, చంద్రారెడ్డి, వన్నెరెడ్డి సేవాసంఘం అధ్యక్షుడు సురేష్‌బాబు, తిరుమలరెడ్డి, గోవిందరెడ్డి, కృష్ణారెడ్డి, మునిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నీసాయం.. మేం మరువం

వయసు మీద పడి.. కంటి చూపు మందగించి.. కళ్లు సరిగా కనిపించక.. ఆస్పత్రికి వెళ్లి పరీక్షించుకోవాలంటే ఆర్థిక పరిస్థితి సహకరించక.. ఆస్పత్రికి తీసుకెళ్లే వారు లేక వెళ్లలేని పరిస్థితుల్లో ఉన్నవారి పాలిట మంత్రి రోజా ఆపద్బాంధవిలా నిలుస్తున్నారు. అవసాన దశలో కళ్లు సరిగా కనిపించక, పట్టించుకునేవారు లేక, తమకంటూ ఎవరూ లేకపోవడంతో ఏం చేయాలో తోచక అచేతనంగా ఉన్నవారికి రోజా చారిటబుల్ ట్రస్టు వరప్రదాయనిగా మారింది. శంకర నేత్రాలయతో కలిసి రోజా చారిటబుల్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఉచిత కంటివైద్యశిబిరంతో ఎంతోమందికి

- రోజా చారిటబుల్ ట్రస్ట్, శంకర్ నేత్రాలయ సంస్థల దాతృత్వం
- నగరిలోని మంత్రి రోజా క్యాంపు కార్యాలయంలో ఉచితంగా కంటి వైద్య సేవలు
- 1690 మందికి కంటి పరీక్షలు, 185 మందికి ఆపరేషన్
- ఆనంద బాష్పాలతో మంత్రి రోజాకు రోగుల కృతజ్ఞతలు
- నేటితో ముగియనున్న కంటి వైద్యశిబిరం



మంత్రి రోజాకు కృతజ్ఞతలు తెలుపుతున్న వృద్ధులు

నగరి: అంధత్వ నివారణే లక్ష్యంగా నగరిలోని మంత్రి రోజా క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. వారం రోజులుగా జరుగుతున్న ఈ శిబిరంలో ఉదయం 8 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు 1,690 మందికి కంటి పరీక్షలు చేయగా వీరిలో 290 మందిని కంటి చికిత్స నిమిత్తం బేస్ ఆస్పత్రికి పంపగా, 185 మందికి శిబిరం వద్దే ప్రాంతంలోనే ప్రపంచ ప్రసిద్ధి గాంచిన మొబైల్ ఐ సర్జికల్ యూనిట్ ద్వారా ఆపరేషన్ చేశారు. సోమవారం రాత్రి వరకు ఈ క్యాంపు కొనసాగనుంది. ఉచితంగా వైద్య



దివ్యాంగురాలికి ఆపరేషన్ చేసి తీసుకొస్తున్న వైద్యులు

చికిత్స అందించడంతో పాటు రోగులకు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం ట్రస్టు తరఫున అందిస్తున్నారు. నడవలేని వికలాంగులను, వయోవృద్ధులను సొంత బిడ్డల్లా ఎత్తుకెళ్లి వైద్యులు ఆపరేషన్ చేస్తుండడం మానవత్వానికి ప్రతీకగా నిలుస్తోంది.

మంత్రి ఆర్‌కే రోజా పరామర్శ..

కంటి వైద్య శిబిరంలో ఆపరేషన్ చేయించుకున్న వారిని మంత్రి ఆర్కేరోజా ఆదివారం పరామర్శించారు. వైద్యులు చెప్పిన సూచనలు పాటించాలని సూచించారు. ఎండలో తిరగకుండా కంటి అద్దాలు వాడుతూ వైద్యులు చెప్పినన్ని రోజులు విశ్రాంతి తీసుకోవాలన్నారు. ఆపరేషన్ చేసుకున్న వృద్ధులు ఆప్యాయంగా మంత్రి వద్దకు వెళ్లి ఆనందంతో ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు.

కంటిచూపు మంత్రి చలవే..



ఆరు నెలలుగా కంటి చూపు మందగించి సరిగా కనిపించడం లేదు. వృద్ధాప్యం, డబ్బుల్లేని కారణంగా ఆస్పత్రికి వెళ్లి పరీక్షించుకోలేని పరిస్థితి. దీంతో ఇలానే గడిపేద్దాం అనుకున్నా. ఈ దశలో నేనున్న ప్రాంతానికి సమీపంలో మంత్రి నివాసం వద్ద కంటి పరీక్షలు చేస్తారని తెలిసి ఇక్కడకు విచ్చేశాను. వైద్యులు నా కంటికి పరీక్షలు చేసి కంటిలో పొర పెరుగుతోందని చెప్పారు. ఇక్కడే ఎలాంటి ఖర్చులు లేకుండా ఆపరేషన్ చేశారు. ఇదంతా మంత్రి ఆర్కే రోజా చలవే. – దేవారం, కాకవేడు

సొంత కూతురిలా సాయం..



ఓ కన్న కూతురు తన తండ్రికి ఎలా సాయం చేస్తుందో నా పాలిట మంత్రి రోజా అందించిన సాయం అలాంటిదే. ఈ వృద్ధాప్య దశలో చెన్నై, తిరుపతికి పరీక్షలకు ఒకసారి, ఆపరేషన్‌కు ఒకసారి అంటూ వెళ్లే పరిస్థితి లేదు. ఈ తరుణంలో మంత్రి రోజా వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిసి ఇక్కడకు వచ్చాను. కంటి పరీక్షలు చేసి ఆపరేషన్ చేశారు. నా యోగక్షేమాలను కన్నకూతురిలా మంత్రి రోజా అడిగి తెలుసుకున్నారు. – వరదయ్య, అత్తూరు

వెల కట్టలేని సాయం..



దేవుడు మనిషి రూపంలో వచ్చి సాయపడతాడని చెబుతారు. అది నిజమే వయో వృద్ధాప్యంలో కంటి చూపు సరిగా లేక నేను పడుతున్న అవస్థలు అన్నీ ఇన్నీ కావు. అయితే భగవంతుడు మంత్రి ఆర్కేరోజా రూపంలో వచ్చి మాకు సాయపడుతున్నాడనిపించింది. వైద్యసేవలు అందించి, ఇక్కడే భోజనం పెట్టి, ఆపరేషన్ చేసి, అద్దాలు ఇచ్చి ఎలా నడుచుకోవాలో చెప్పి, మందులు ఇచ్చి పంపుతున్నారు. ఇది వెల కట్టలేని సాయం. – గోవిందస్వామి, సత్రవాడ దళితవాడ

ఆమె చల్లగా ఉండాలి



మాలాంటి అభాగ్యులు ఎందరికో సాయపడుతున్న మంత్రి రోజమ్మ చల్లగా ఉండాలి. ఇంతమంది వృద్ధులు ఉచితంగా ఆపరేషన్ చేసుకుని వెళ్తున్నారంటే ఇది సాధారణమైన విషయం కాదు. శంకర నేత్రాలయ వారితో చర్చించి ఇక్కడ క్యాంపు నిర్వహించేలా చేసి ఇంతగా సాయపడుతున్న ఆమె రుణం తీర్చుకోలేనిది. ఇలా కలకాలం ఆమె పలువురికి సాయం అందించే స్థానంలోనే ఉండాలని భగవంతుని ప్రార్థిస్తున్నా. – వెంకటరాజు, విజయపురం

ఘనంగా ఈస్టర్ వేడుకలు

- ప్రత్యేక అలంకరణలో చర్చిలు
- అన్నదానం చేసిన క్రిస్టియన్లు



శ్రీకావేరిరాజుపురం చర్చిలో ఈస్టర్ ప్రాముఖ్యతను వివరిస్తున్న పాస్టర్ పాల్‌రాజ్



బలిజకండ్రిగ చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు

కార్వేటినగరం: పవిత్రమైన ఈస్టర్ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. మండలకేంద్రంలోని బీసీ కాలనీలో ఉన్న బేతేల్ షారోన్ చర్చిలో పాస్టర్ ఆశీర్వాదం ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చర్చిలను ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం పాస్టర్ ఆశీర్వాదం మాట్లాడుతూ ఏసుప్రభువు దేవుని రూపంలో పునరుజ్జీవితుడై భూలోకానికి వచ్చిన రోజును ఈస్టర్‌గా జరుపుకుంటామని చెప్పారు. మధ్యాహ్నం పేదలకు అన్నదానం నిర్వహించారు. కార్వేటినగరంలో నాలుగురాళ్ల వద్ద ఉన్న యెహోవా ఈరే చర్చిలో కూడా ఈస్టర్ సండే వేడుకలను పాస్టర్ సరోజిని అగస్టీన్ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. అలాగే మండలంలోని అల్లాగుంట, పాదిరికుప్ప, కొల్లాగుంట సీఎస్ఐ చర్చిల్లో కూడా ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

పాలసముద్రంలో..

పాలసముద్రం : మండలవ్యాప్తంగా చర్చిల్లో క్రిస్టియన్లు ఆదివారం అన్ని చర్చిల్లో ఈస్టర్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. శ్రీకావేరిరాజుపురం చర్చిల్లో పాస్టర్ పాల్‌రాజ్ ప్రత్యేక ప్రార్థనలు చేసి పలు గీతాలు ఆలపించారు. ఏసు సందేశాన్ని ప్రజలకు అందించడానికి దీనబంధుపురం నుంచి చర్చి వరకు క్రైస్తవులు ప్రార్థనలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. శ్రీకావేరిరాజుపురం చర్చిల్లో పాస్టర్ పాల్‌రాజ్ వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు.

వెదురుకుప్పంలో..

వెదురుకుప్పం: మండలంలోని దేవరగుడుపల్లె సీఎస్ఐ ఎస్టీ మాథ్యూస్, తెల్లగుండ్లపల్లెలోని సీఎస్ఐ ఇమ్మానుయేల్ చర్చిల్లో ఆదివారం ఈస్టర్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా క్రిస్టియన్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం పాస్టర్ అన్బుదాస్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు మరణించి పాపుల కోసం మళ్లీ జన్మించి భూమిపైకి వచ్చిన రోజును ఈస్టర్ అని అంటారన్నారు. క్రీస్తు సందేశాన్ని ప్రతిఒక్కరూ అనుసరించాలని ఉపదేశించారు.

పెనుమూరులో..

పెనుమూరు(కార్వేటినగరం) : మండల కేంద్రంలోని బారూకు ఏంజెల్ చర్చిలో ఈస్టర్ వేడుకలను పాస్టర్ భాస్కర్‌ఫాల్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పెనుమూరు బస్టాండ్‌లో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రయాణికులకు మజ్జిగ, నిమ్మరసం అందించారు. అదేవిధంగా అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సేవకులు సాల్మన్‌రాజ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

నింద్రలో..

నింద్ర: మండలంలోని అత్తూరు, అరూరు, మేళంబాకం గ్రామాల్లో ఆదివారం జగనన్నే మా భవిష్యత్–మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని స్థానిక నాయకులు నిర్వహించారు. గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం చేపడుతున్న పలు సంక్షేమ పథకాలు వివరించారు. ప్రతి ఇంటికీ పార్టీ స్టిక్కర్లను అంటించి, 82960 82960 నంబర్‌కు మిస్డ్ కాల్ ఇచ్చి జగనన్న ప్రభుత్వానికి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ వేణు రాజు, కోఆప్షన్ సభ్యులు అనిల్, సింగిల్‌విండో అధ్యక్షుడు మునికృష్ణారెడ్డి, రమణరాజు, వలంటీర్లు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం



కరకంతాపురంలో జగనన్నే మా భవిష్యత్–మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో నాయకులు



తెరణి గ్రామంలో జగనన్నే మా భవిష్యత్–మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో నాయకులు



వెదురుకుప్పం: 'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్లు అతికిస్తున్న నాయకులు

నగరి : జగనన్నే మా భవిష్యత్తు–మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ఊరువాడా సందడిగా జరుగుతోంది. పార్టీ గృహసారథుల ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. మున్సిపల్ పరిధిలోని కరకంతాపురంలో మున్సిపల్ సచివాలయ కన్వీనర్ దయానిధి ఆధ్వర్యంలో ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ఏ మేరకు లబ్ధి పొందారో వారి ద్వారానే తెలుసుకున్నారు. అలాంటి సంక్షేమ పథకాలపై వారి అభిప్రాయాలను సేకరించారు. మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను అంటించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ చినపాప, నాయకులు మురుగ, కోఆప్షన్ సభ్యులు ఎల్లప్పరెడ్డి, గోవిందరెడ్డి, తనికాచలం తదితరులు పాల్గొన్నారు. మండలంలోని తెరణి గ్రామంలో ఎంపీటీసీ ఏసు ఆధ్వర్యంలో గృహసారథులు, నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి అభిప్రాయ సేకరణ చేసి స్టిక్కర్లు అతికించారు.

జనరంజక పాలనకు జనం జేజేలు

వెదురుకుప్పం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జనరంజక పాలనకు జనం జేజేలు పలుకుతున్నారని జెడ్పీటీసీ సభ్యుడు సుకుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని మాంబేడు, పచ్చికాపల్లం, పాతగుంట గ్రామ సచివాలయాల పరిధిలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి మానమ్మకం నువ్వే జగనన్న స్టిక్కర్లు అతికించి లబ్ధిదారుల అభిప్రాయాలను నమోదు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా జగనన్న సంక్షేమ పథకాలను అందిస్తుండడంతో అందరూ జగనన్నకు మద్దతు తెలుపుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మనాభరెడ్డి, గృహసారథుల కన్వీనర్ బట్టీ సుబ్రమణ్యం, ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు రామమయ్య, సింగిల్‌విండో డైరెక్టర్ మునికృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ గోవిందన్, బొజ్జారెడ్డి, రవికుమార్‌రెడ్డి, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

చిన్నకనుమలో టిప్పర్ బోల్తా



చిన్నకనుమ వద్ద బోల్తాపడిన టిప్పర్

కార్వేటినగరం: టిప్పర్ బోల్తా పడిన సంఘటన మేజర్ పంచాయతీ కార్వేటినగరం సమీపంలోని చిన్నకనుమ మలుపు వద్ద శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలు.. పచ్చికాపల్లం నుంచి కార్వేటినగరం వైపు ముగ్గుపిండి లోడుతో వస్తున్న టిప్పర్ చిన్నకనుమ వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. పచ్చికాపల్లం నుంచి కార్వేటినగరం వైపుగా వచ్చే టిప్పర్లు ఎక్కువ లోడుతో వస్తుండడంతో చిన్నకనుమ వద్ద డ్రైవర్లు వాహనాన్ని అదుపు చేయలేక ప్రమాదాల బారిన పడుతున్నారు. వారంలో రెండు, మూడు సార్లు ఇక్కడ వాహన ప్రమాదాలు జరుగుతుంటాయి. నిత్యం వాహన చోదకులు పళ్లిపట్టు, కార్వేటినగరం నుంచి తిరుపతికి ఈ మార్గంలో ప్రయాణం చేస్తుంటారు. అయితే పెద్దకనుమ నుంచి చిన్నకనుమ వరకు రోడ్డు నిటారుగా ఉండడం వల్ల టిప్పర్లు, లారీలు అదుపు తప్పి 15 అడుగుల లోయలోకి బోల్తా పడుతుంటాయని చెబుతున్నారు. వారం కిందట కూడా ఇదే ప్రాంతంలో టిప్పర్ అదుపు తప్పి 33 కేవీ విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. అయితే డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. గత నెలలో కూడా ఓ టిప్పర్ అదుపు తప్పి పాడి ఆవును ఢీకొనడమే కాకుండా కార్వేటినగరంలోని గాండ్లమిట్ట కూడలి వద్ద నిల్చున్న ఇద్దరు వ్యక్తులను ఢీకొనడంతో ఓ మహిళ మృతి చెందింది. ఓ వ్యక్తిని సుమారు 200 మీటర్ల వరకు లాక్కెళ్లిన సంఘటన చోటు చేసుకుంది. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి పెద్దకనుమ, చిన్నకనుమ వద్ద ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని, అలాగే టిప్పర్ల వెళ్లకుండా నియంత్రించాల్సిన అవసరం ఉందని కోరుతున్నారు.

చట్టసభల్లో ఈడిగలకు ప్రాధాన్యత కల్పించాలి

అనంతపురం టవర్‌క్లాక్: చట్టసభల్లో ఈడిగ (గౌడ)లకు ప్రాధాన్యత కల్పించేలా అన్ని రాజకీయ పార్టీలు చొరవ తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ నేత కేజే కుమార్ కోరారు. ఈడిగలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించే అంశంపై ఆదివారం అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు.

ఈడిగ మేధావుల ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా కేజే కుమార్, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జోనల్ కో–ఆర్డినేటర్ రమేష్ గౌడ్, బీజేపీ నేత బి.కిరణ్‌కుమార్ గౌడ్ హాజరయ్యారు. రాయలసీమ జిల్లాలతో పాటు నెల్లూరు, ప్రకాశం జిల్లాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ఈడిగలకు రెండు ఎంపీ, మూడు ఎమ్మెల్యే, రెండు ఎమ్మెల్సీ స్థానాలతో పాటు వివిధ నామినేటెడ్ పోస్టులు కేటాయించాలన్నారు. సమావేశంలో ఈడిగ సంఘం నేతలు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆదరించండి

- సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగనన్న సీఎంగా ఉంటేనే సాధ్యం
- చంద్రబాబు పాలనంతా మోసమే..
- టీడీపీ మాయమాటలు నమ్మవద్దు
- మంత్రి ఆర్‌కే రోజా పిలుపు



మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్‌ను అతికిస్తున్న మంత్రి ఆర్‌కే రోజా

పుత్తూరు రూరల్: ప్రజారంజక పాలన అందిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రెండోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకుందాం అంటూ రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసులు, క్రీడాశాఖ మంత్రి ఆర్‌కే రోజా పిలుపునిచ్చారు. ఆదివారం సాయంత్రం పుత్తూరు రూరల్ మండలం వేపగుంట హరిజనవాడలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆమె నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అవ్వా పెన్షన్ అందిందా? అక్కా చేయూత అందిందా? ఆసరా మీ కుటుంబానికి అందిందా ? అంటూ ఆరా తీశారు. అందరూ అన్ని పథకాలు తమకు అందుతున్నాయని ముక్తకంఠంతో సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి రోజా మాట్లాడుతూ ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా, మరింత అభివృద్ధి జరగాలన్నా మరోసారి జగనన్నకు సీఎంగా అవకాశం ఇవ్వాలని, అందుకు నేను సిద్ధం.. మీరు సిద్ధమా అన్ని ప్రశ్నించారు. పలువురు మహిళలు మేము కూడా సిద్ధం అంటూ ముక్తకంఠంతో సమాధానం ఇచ్చారు. ఇలా గ్రామాలకు గ్రామాలు ఒక్కతాటిపై నిలబడి అభివృద్ధిని, సంక్షేమాన్ని సాధించుకోవాలని సూచించారు.

చంద్రబాబు పాలనంతా మోసమే..

గత చంద్రబాబు పాలనలో సంక్షేమం ఊసే లేదని, అభివృద్ధి అటకెక్కిందని, పాలనంతా మోసమే అని మంత్రి రోజా ఆరోపించారు. మళ్లీ ఇప్పుడు అబద్ధాలు చెబుతూ ప్రజల మధ్యకు వస్తున్నాడని, పొరపాటున కూడా చంద్రబాబును నమ్మవద్దని ప్రజలకు సూచించారు. గడిచిన నాలుగేళ్లలో సీఎం జగనన్న అద్భుతాలు చేశారని, ఇందుకు దేశ ప్రధాని ప్రశంసలే నిదర్శనమన్నారు. ఎన్నికల సందర్భంగా ప్రతి రాజకీయ పార్టీ విడుదల చేసే మేనిఫెస్టోలోని హామీలను నెరవేర్చిన దాఖలాలు లేవని, అయితే జగనన్న 98 శాతం హామీలను నెరవేర్చి సరికొత్త చరిత్ర సృష్టించారని వివరించారు. ఇలాంటి సీఎం మనకు ఉండడం రాష్ట్ర ప్రజలు చేసుకున్న అదృష్టమని అభివర్ణించారు.

గడప గడపలో జగనన్నే మా భవిష్యత్..

గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమంలోనే జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని మంత్రి రోజా నిర్వహించారు.

ఇంటింటికీ వెళ్లి జగనన్న పాలనపై 5 ప్రశ్నలు వేయగా అందరూ ముక్తకంఠంతో జగనన్న ప్రభుత్వానికి మద్దతు పలికారు. మళ్లీ జగనన్నే రావాలంటూ నినదించారు. వారి ఇళ్లకు ×మా నమ్మకం నువ్వే జగన్¥ స్టిక్కర్లను మంత్రి అతికించారు. కార్యక్రమంలో ఎంపీపీ మునివేలు, వైస్ ఎంపీపీ మునస్వామిరెడ్డి, గ్రామ సర్పంచ్ గిరిజాప్రసాద్, మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్‌యాదవ్, మాజీ వైస్ ఎంపీపీ లక్ష్మణమూర్తి, స్థానిక నాయకులు నరసింహులు, సుదర్శన్, రాజయ్య, జయకుమార్, కిషోర్, మనో, కృష్ణమూర్తి, బిస్తు, మోహన్‌గాంధీ, రాజా, రాంబత్తయ్య, శ్రీధర్, బుజ్జి, తదితరులు పాల్గొన్నారు.

16 నుంచి ఐఎఫ్‌టీయూ జాతీయ మహాసభలు

తిరుపతి కల్చరల్: తిరుపతిలో ఈ నెల 16, 17, 18 తేదీల్లో భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) 7వ అఖిల భారత మహాసభలు నిర్వహించనున్నట్టు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.ప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్.హరిక్రిష్ణ తెలిపారు. వారు ఆదివారం ఆ సంఘం కార్యాలయంలో జాతీయ మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ సభల్లో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమ నిర్మాణ కర్తవ్యాలను చేపట్టనున్నట్లు తెలిపారు. 16వ తేదీన ఉదయం 10 గంటలకు లక్ష్మీపురం సర్కిల్ నుంచి భారీ కార్మిక ప్రదర్శన ప్రారంభమవుతుందని తెలిపారు. అనంతరం పద్మావతి పార్క్ వద్ద బహిరంగ సభ చేపడతామన్నారు. 17, 18వ తేదీల్లో ఎస్ఎస్‌బీ కల్యాణ మండపంలో ప్రతినిధుల సభ ఉంటుందని తెలిపారు.

సలాం.. వందే భారత్



వందేభారత్ రైలు ప్రయాణం ప్రయాణికులకు కొత్త అనుభూతిని ఇస్తోంది. ఈ క్రమంలో ఆదివారం తిరుపతి నుంచి బయలుదేరిన వందే భారత్ రైలులో ఎక్కిన ప్రయాణికులు చేతులు ఎత్తి ఆనందం వ్యక్తం చేశారు. కొంతమంది విద్యార్థినులు తిరుపతి రైల్వే స్టేషన్‌లోకి వస్తున్న రైలు కనిపించేలా సెల్ఫీ తీసుకుని మురిసిపోయారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి



